## క్లుప్తంగా

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**సంతబొమ్మాళి:** మండలంలోని వడ్డితాండ్ర గ్రామానికి చెందిన విద్యార్థి మండల వేణు బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. దీంతో విద్యార్థి మందుల ఖర్చు నిమిత్తం లాసా ఫౌండేషన్ సభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. కార్యక్రమంలో లాసా ఫౌండేషన్ వాలంటరీ కె.శాంతకుమారి, స్పందన ఫౌండేషన్ సభ్యులు షణ్ముఖరావు, ఎస్.రమణ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలకు 50 కుర్చీల వితరణ



పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

**టెక్కలి:** మండలంలోని నరసింగపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన నరసింగపల్లి సేవా సంఘం సభ్యులు 50 కుర్చీలను వితరణగా అందజేశారు. గురువారం పాఠశాల హెచ్‌ఎం యు.గణపతిరావుకు కుర్చీలను అందజేశారు. అలాగే ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన సింగుపురం ప్రియాంక, దారపు రేష్మ, సార సందీప్ తదితర విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎన్ని షణ్ముఖరావు, దారపు ధర్మారావు, పొట్నూరు శంకరరావు, పి.సంతోష్, ఐ.గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### సౌండ్ సిస్టం వితరణ



సౌండ్ సిస్టంతో దాత జగదీష్, ఉపాధ్యాయులు

**కంచిలి:** మండలంలోని ఎస్.ఆర్.సి.పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సౌండ్ సిస్టంను కంచిలి గ్రామానికి చెందిన దాత జగదీష్ పట్నాయక్ వితరణగా ఇచ్చారు. దీన్ని పాఠశాల హెచ్‌ఎం దీవెన రాణి గురువారం ప్రారంభించారు. విద్యార్థుల విద్యోన్నతికి ఉపయుక్తంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ కుమారి, ఉపాధ్యాయులు ముకుంద, దేవి ప్రియ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం రూరల్:** మండలంలోని డొంకూరు ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు సుమారు రూ.40 వేలు విలువైన సౌండింగ్ సిస్టమ్‌ను బహూకరించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరామ్‌కు అందజేశారు.

### నవధాన్యాల పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

**కంచిలి:** మండలంలోని జాడుపూడి గ్రామంలో రైతు మునకాల మాధవరావుకు చెందిన పొలంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న నవధాన్యాలు పంటకోత ప్రయోగాన్ని గురువారం చేపట్టారు. ఒక ఎకరానికి 12 కిలోల నవధాన్యాలు 25 రకాలు వేసినట్లు మండల యాంకర్ టి.శివానందం తెలిపారు. మంచి దిగుబడులు వస్తాయని తెలియజేశారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



దుక్క అప్పారావు(ఫైల్)

**సంతబొమ్మాళి:** మండల వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి దుక్క అప్పారావు గుండెపోటుతో స్వగ్రామం కాపు ఉమిలాడలో గురువారం మృతి చెందారు. ఆయన మృతిపై వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి తదితరులు సంతాపం తెలిపారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు.

# ఉద్యమ స్మృతులు



సమర యోధులకు గుర్తుగా టెక్కలి పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహం



టెక్కలికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు అనంత మధుసూదన బెహరా అప్పట్లో కంద్రవీధిలో నిర్మాణం చేసిన గాంధీజీ మందిరం

టెక్కలి:

శిథిలావస్థ... **శ్రీ**విగా కనిపించే ఆ స్మారక స్థూపాల వెనుక దాగిన వీర గాథలెన్నో. నిశ్శబ్దంగా కనిపించే ఆ మందిరాల వెనుక దాగి ఉన్న నినాదాలెన్నో. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆ గాథలు తెలుసుకుందాం.. ఆ వీరులను స్మరించుకుందాం.

- టెక్కలికి చెందిన టంకాల రామన్న 1916లో హోమ్‌రూల్ ఉద్యమం, ట్రిపుల్ బాయ్‌కాట్ ఉద్యమం, 1930 ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. అలాగే యంగ్ ఇండియా అనే పత్రికను నిర్వహించారు.
- టెక్కలికి చెందిన తామాడ అప్పన్న క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని ఏడాది కాలం పాటు జైలు జీవితాన్ని గడిపారు.
- టెక్కలి మండలం మోదుగువలస గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన రెయ్యి చంద్రయ్య 1927 సైమన్ కమిషన్ గోబ్యాక్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 1942 నుంచి 43 సంవత్సరం వరకు జైలు జీవితాన్ని గడిపారు.
- సంతబొమ్మాళి మండలం కోటబొమ్మాళి ఆర్.ఎస్‌కు చెందిన టంకాల కృష్ణమూర్తి త్రివిధ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నారు. అలాగే టంకాల రంగన్న హోంరూల్ ఉద్యమంలో పాల్గొన్నారు.
- టెక్కలికి చెందిన మలిపెద్ది కృష్ణమూర్తి 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారు. అలాగే టంకాల వెంకటరాజు శాసనోల్లంఘణ, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండి యా ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారు.



స్వాతంత్ర్య సమరంలో టెక్కలి సమరయోధుల పోరాటాలకు గుర్తుగా టెక్కలి మెయిన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్మారక స్థూపం

- సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన దుక్క సూర్యనారాయణరెడ్డి డిస్ ఒబిడియన్స్ ఉద్యమంలో పాల్గొన్నారు. ఏడాది పాటు జైలు జీవితాన్ని గడిపారు. అప్పట్లో బ్రిటీష్ ప్రభుత్వం రూ.200 రూపాయల జరిమానా విధించింది.
- టెక్కలికి చెందిన టంకాల సాంబమూర్తి 1921 సహాయ నిరాకరణ ఉద్యమంతో పాటు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఒక ఏడాది జైలు జీవితాన్ని గడిపారు. అలాగే శివాల సుబ్బారావు పంతులు సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహం ఉద్యమాల్లో పాల్గొన్నారు. అలాగే టెక్కలి కంద్రవీధికి చెందిన అనంత మధుసూధన బెహరా అదే వీధిలో గాంధీజీకి గుడి కట్టించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారు. శివాల రామ్మూర్తి ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారు. మంత్రాల సీతమ్మ శాసనోల్లంఘణ ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని గడిపారు.
- టెక్కలి మండలం శాసనం గ్రామానికి చెందిన మల్లాది కృష్ణమూర్తి పంతులు 1921లో సహాయ నిరాకరణ ఉద్యమం, 1930లో ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొన్నారు. ఇదే గ్రామానికి చెందిన మల్లాది వెంకటసూర్యనారాయణమూర్తి సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. నందిగాం మండలం పెంటూరు గ్రామానికి చెందిన అట్టాడ రామినాయుడు ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో పాల్గొన్నారు.
- టెక్కలి మండలం జెండాపేట గ్రామానికి చెందిన బి.ఎం.రెడ్డి 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.
- సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన దుర్గాప్రసాద్ శతపతి 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 6 నెలల అజ్ఞాతవాసాన్ని అనుభవించారు.

స్వతంత్ర శ్రీకాకుళం

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు



మాట్లాడుతున్న పేరాడ తిలక్

**టెక్కలి:** పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్, పోలీసులు, పోలింగ్ సిబ్బంది మొత్తం కూటమి నేతలతో కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. గురువారం టెక్కలిలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లు, వైఎస్సార్‌సీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కొంతమంది కూటమి కార్యకర్తలు దర్జాగా దొంగ ఓట్లు వేస్తున్నప్పటికీ, అధికారులు పట్టనట్లు వ్యవహరించారని దుయ్యబట్టారు. దొంగ ఓట్ల వ్యవహారంపై ఆధారాలతో సహా ఎన్నికల సిబ్బందికి అందజేసినప్పటికీ కనీసం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పోలింగ్ రోజున అడుగడుగునా వైఎస్సార్‌సీపీ నాయకులు, మద్దతుదారులపై ఆంక్షలు విధిస్తూ ఓట్లు వేయనీయకుండా చేశారన్నారు.

# గిరిజనుల అభ్యున్నతికి కృషి



వాటర్ సిస్టంను ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

**కంచిలి:** గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని నువాగడ పంచాయతీ పరిధి తుట్టాసాయి గ్రామ శివాలయం ప్రాంగణంలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.1.5 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన వాటర్ సిస్టంను ఎంపీపీతో పాటు స్థానిక సర్పంచ్ సబితా గొమాంగో చేతులమీదుగా గురువారం ప్రారంభించారు. అదే విధంగా ఇదే గ్రామంలో రూ.1.5 లక్షల మండల పరిషత్ నిధులతో మంజూరు చేసిన బోరు, మినీ వాటర్ ట్యాంక్ సిస్టం పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు తలగాన తిరుపతి, పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దు వెంకటరావు, యువజన విభాగం అధ్యక్షుడు మద్దు అభి యాదవ్, ఎస్టీ విభాగం అధ్యక్షుడు రుషి భూయా, మండల కమిటీ సభ్యుడు బేసి రమేష్, మాజీ సర్పంచ్ రమేష్ గౌడో, శ్రీకాంత్ గౌడో, భయ్యా గొమాంగో, హరిచంద్ర బిసాయి, బినా బిసాయి తదితతరులు పాల్గొన్నారు.

## త్వరలో ఫ్లై ఓవర్ పనులు



ఆర్‌ఓబీ నిర్మాణానికి మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

**ఇచ్ఛాపురం:** త్వరలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు ప్రారంభించనున్నట్లు రైల్వే ఏఎక్స్‌సీఎస్ కన్సలెంట్ ఆర్‌ఎస్‌పీ డి.ప్రకాశరావు తెలియజేశారు. పట్టణంలోని రత్తకన్న రోడ్‌లో ఉన్న రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద ఆర్‌ఓబీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఆర్డీవో వెంకటరమణతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ రూ.70 కోట్లతో ఎల్‌సీగేట్ నుంచి రైల్వే క్వార్టర్స్ మీదుగా కొళిగాం రోడ్డుకి 500 మీటర్ల వరకు ఆర్‌ఓబీ నిర్మాణ పనులు జరగనున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రాజేష్‌కుమార్‌గౌడ్, తపస్‌కుమార్‌సాహు, ఇచ్ఛాపురం డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి పాల్గొన్నారు.

### పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు

**ఇచ్ఛాపురం:** స్థానిక రోటరీ క్లబ్ సహకారంతో మున్సిపల్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు తాగునీటిని అందించే ఆర్వో ప్లాంట్‌ని ఏర్పాటు చేశారు. గురువారం ఆర్వో ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి చేతుల మీదుగా నిర్వహించారు. రోటర్లీ క్లబ్ అధ్యక్షుడు మాచర్ల రాజ్‌కుమార్, కార్యదర్శి పి.దినేష్‌కుమార్, బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ ప్రతినిధు లు రామారావు, షణ్ముక, ప్రదీప్, కృష్ణమూర్తిరెడ్డి, గోపాలరావు, తులసీదాస్, రామకోటి, చౌదరి పాల్గొన్నారు.

# పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి బలరాం

**పలాస:** మున్సిపల్ కార్మికులకు 12వ పీఆర్‌సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఆప్కాస్ రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.బలరాం డిమాండ్ చేశారు. కాశీబుగ్గ హైస్కూల్ గ్రౌండ్‌లోని మంకినమ్మ గుడి ఆవరణలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ మహాసభ గురువారం నిర్వహించారు. సీహెచ్ మురగన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో బలరాం మాట్లాడుతూ.. సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి, అధ్యక్షుడిగా సీహెచ్ మురగన్, కార్యదర్శిగా ఎస్.శంకర్, కోశాధికారిగా ఎం.రవి, కార్యవర్గ సభ్యులుగా కె.బాలకృష్ణ, ఎస్.డిల్లీ, అమర్‌నాయక్, ప్రకాష్‌ముఖి, ఎన్.రమేష్, జీవన్‌బెహరా, ఎస్.ఈశ్వరి, త్రివేణి, పుణ్యావతులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

**కంచిలి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ యు.జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మందస, ఇచ్ఛాపురం కళాశాలల ప్రిన్సిపాల్స్ తేజేశ్వరరావు, శంకరరావు పాల్గొన్నారు.

### కుండపోత వర్షం

**కంచిలి:** మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో రోడ్ల మీదుగా వర్షపు నీరు ప్రవహించింది. దీంతో వ్యాపారులు, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చాలా రోజుల తర్వాత మంచి వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ వానలు ఖరీఫ్ సాగుకు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

# ఎల్‌ఆర్‌ఎస్‌ను వినియోగించుకోవాలి

**పలాస:** పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రస్తుతం అమల్లో ఉన్న భూక్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్)ను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.రామారావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. 2025 జూన్ 30లోపు ప్లాటు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు ఎవరైనా ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ పథకంలో చాలా రాయితీలు ఉన్నాయని తెలియజేశారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు రూ.10 వేల ఫీజు తగ్గకుండా ప్రాథమికంగా చెల్లించాలని సూచించారు. ఫీజు మొత్తం 45 రోజుల్లో చెల్లిస్తే 10 శాతం రాయితీ, 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశం అక్టోబర్ వరకు ఉందని తెలిపారు. మున్సిపాలిటీలో మొత్తం 22 అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, వారితో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

### మంచినీటి సరఫరాకు అంతరాయం నేడు

**టెక్కలి:** టెక్కలి మేజర్ పంచాయతీ సోగ్గాడిపేట వీధిలో ఉన్న మంచినీటి ట్యాంకు వద్ద మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈవో ఏవీ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనివలన సోగ్గాడిపేట, చిన్నచేరీవీధి, పెద్ద చేరీవీధి, గందరగోళంవీధి, దండుపాటి వీధి, శివాలయం వీధి, అంబేడ్కర్ వీధి, రెడ్‌క్రాస్ వీధి, గొల్లవీధి, రాజావీధి, కుమ్మరవీధి, గౌడవీధి, రాజావారివీధి, చిన్నబ్రాహ్మణవీధి, పెద్దబ్రాహ్మణ వీధి, గొడగలవీధులకు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**టెక్కలి:** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సంతబొమ్మాళి మండలం పాలేశ్వరస్వామి ఆలయం నుంచి కోటబొమ్మాళి మార్కెట్ కమిటీ వరకు అన్నదాత సుఖీభవ ర్యాలీ గురువారం నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఇప్పటికే 90 శాతం వరకు ఇచ్చిన హామీలు నెరవేర్చామని మంత్రి తెలిపారు. కేంద్రం అందజేస్తున్న సాయంతో కలిపి అన్నదాత సుఖీభవ అందజేస్తున్నట్లు వెల్లడించారు. శుక్రవారం నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మూలపేట నుంచి వేములవాడ మీదుగా భోగాపురం వరకు 8 లైన్ల రోడ్లు వేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమసుందర్, ఎంపీడీవో పి.జయంతిప్రసాద్, వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ యూనిట్ మంజూరు



ఎన్‌సీసీ సబ్ యూనిట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాజమాన్యం

**టెక్కలి:** మండలంలో పాత నౌపడ సమీపంలోని ప్రణవి డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ సబ్ యూనిట్ మంజూరు చేస్తూ 14వ ఆంధ్ర బెటాలియన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని కళాశాల చైర్మన్ పేడాడ పరమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాలలో అన్ని రకాల సదుపాయాలు ఉండడంతో ఎన్‌సీసీ సబ్ యూనిట్‌ను మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఇటువంటి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో త్రివిధ దళాలతో పాటు ఇతర కోర్సులకు ఎన్‌సీసీ రిజర్వేషన్ పొందాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ ఎస్.రమణయ్య, బేక్యాడ్ అడ్మినిస్ట్రేటర్ కె.అప్పారావు, అసోసియేట్ అధికారులు కె.రుక్మాంధరావు, కె.మంజుల, ఎం.కృష్ణారావు, వి.భోగస్వామి, ఆర్.రామారావు, కె.వెంకట్రావు, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న హస్తకళల ప్రదర్శన

**టెక్కలి:** టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శాక్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన హస్త కళల ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థుల హస్త కళ నైపుణ్యంలో భాగంగా చిత్రలేఖనం, చేతితో తయారు చేసిన వివిధ రకాల బొమ్మలు, గోడ పత్రికల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, అధ్యాపకులు డి.యుగంధర్, డి.శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు

**టెక్కలి రూరల్:** స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోలీసు అవుట్ పోస్టును గురువారం ఏర్పాటు చేశారు. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు టెక్కలి సీఐ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రికి వచ్చే రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన కేసుల వివరాల నమోదుకు గాను, తీవ్ర గాయాలతో రిఫర్ చేసేవారికి ఎస్కార్ట్‌గా వెళ్లేందుకు గాను ఈ అవుట్ పోస్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంట్లో ఒక ఏఎస్ఐతో పాటు కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు.